# అప్పు–తిప్పలు

-శ్రీకారం రామ్మోహన్

రంగారావు పొద్దున్నే వీధిలో పడ్డాడు.

జేబులు ఖాళీగా ఉన్నాయి.

ఎక్కడన్నా కనీసం వంద రూపాయలు అప్పు సంపాయించాలి..

కోదండం గుర్తుకొచ్చాడు. వాడి దగ్గర అప్పు తీసుకుని చాలా రోజులైంది. వాడి దగ్గర అప్పు తప్పకుండా దొరుకుతుంది కూడా..కానీ వాడిని కలవాలంటే విజయనగర్ కాలనీ వెళ్ళాలి. బస్సులో వెళ్ళే అలవాటు లేదు. బస్సు చార్జీ కూడా లేదు. పొద్దున ఓ రూపాయి చిల్లర కనిపిస్తే టీ తాగేశాడు.

ఎదురుగా ఆటో కనిపించింది. ఆటోలోకి దూకి విజయనగర్ కాలనీ పోనివ్వమన్నాడు.

మరో పది నిముషాల్లో విజయనగర్ కాలనీ చేరింది ఆటో. కోదండం ఇంటికి వెళ్ళేసరికి ఆటోమీటర్ తొమ్మిది రూపాయలైంది.

గేటు తీసుకుని లోపలికి వెళ్ళాడు. ఛీ దరిద్రం..తలుపునకు పెద్ద తాళం కప్ప. పొద్దున్నే ఎక్కడికెళ్ళాడు? వాడికి ఇల్లు, ఆఫీసు ఒకటే. ఇంట్లోనే ప్రాక్టీసు.

'నిన్ననే ఊరెళ్ళారండి!' చెప్పాడు పక్కింటాయన.

ఉసూరుమంటూ వచ్చి మళ్ళీ ఆటోలో కూలబడ్డాడు. వెంకట్రావు గుర్తుకొచ్చాడు. పదవుతోంది. కాబట్టి ఈ పాటికి ఆఫీసుకి వెళ్ళి ఉంటాడు. ఆఫీసులో పట్టుకుంటే ఎలాగైనా సర్దుతాడు.

'సికింద్రాబాద్ పోనీ' అన్నాడు. ఆటో చక్రాలతో పాటు మీటర్ కూడా గిరగిరా తిరుగుతోంది. పారడైజు దగ్గర వెంకట్రావు ఆఫీసుకు చేరుకున్నాడు. మీటరు ఇరవై రెండు రూపాయలు.

'ఇప్పుడే ఐదు నిమిషాల్లో వస్తా'అంటూ లోపలికి పరిగెత్తాడు.

'వెంకట్రావుగారు ఇవాళ సెలవండీ. వంట్లో బాగా లేదుట' వెంకట్రావు పక్క సీట్లో టైపిస్టు కులుకుతూ చెబుతుంటే రంగారావుకి కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

ఏం చేయాలో తోచలేదు. అప్పువేట విరమిద్దామన్నా ఆటోను వదుల్చుకునేందుకైనా అప్పు చేయాలి. వెంకట్రావుకి వంట్లో బాగా లేదంటే తప్పకుండా ఇంట్లో ఉండి ఉంటాడు. ఇంటికెళ్ళి పట్టుకుంటే సరి..పరామర్శించినట్టు ఉంటుంది. అప్పుదొరుకుతుంది.

మళ్ళీ వచ్చి ఆటోలో దూకి ' ఆల్వాల్ పోనీ' అన్నాడు. బోణీ బేరం భలే లాభసాటిది దొరికిందని సంతోషిస్తూ ఆటో డ్రైవరు హుషారుగా స్టార్ట్ చేశాడు. మీటర్ తిరుగుతూంటే రంగారావుకి బిపి పెరిగిపోతోంది. ముప్పై ఆరు రూపాయలు..లెఫ్ట్..రైట్..లెఫ్ట్..ముప్పై తొమ్మిది..హమ్మయ్య..వెంకట్రావు ఇల్లొచ్చింది. సంతోషం. తాళం కూడా వేసి లేదు. హడావిడిగా బెల్ నొక్కాడు.

'హల్లో అంకుల్..చాలా రోజులకి వచ్చారే వెంకట్రావు పదేళ్ళ కూతురు తలుపుతీసి పలకరించింది.

''ఏం పాపా..నాన్నగారున్నారా?'' ఆదుర్దాగా అడిగాడు రంగారావు.

''ఇప్పుడే ఆస్పత్రికి వెళ్ళారు అంకుల్. మమ్మీ కూడా వెళ్ళింది. నెల రోజుల నుంచి మాటి మాటికీ జ్వరం వస్తోందని అపోలో ఆస్పత్రిలో టెస్టు చేయించుకుందుకు వెళ్ళారు.'' చెప్పింది పాప.

కాస్త జ్వరం రాగానే వీడు పాలోమంటూ అపోలో ఆస్పత్రికి పోవాలా అని తిట్టుకున్నాడు రంగారావు. అంతదూరం వెళ్ళాడంటే మరో మూడు గంటల వరకూ రాడు.

'సరే వస్తానమ్మా..జాగ్రత్తగా తలుపేసుకో' అని తిరిగి వచ్చేశాడు.

అప్పివ్వగలవాళ్ళు ఇంకెవరున్నారా అని జ్ఞాపకం చేసుకోసాగాడు. శేఖర్. ఆ. శేఖర్ తప్పకుండా ఇస్తాడు. ఇదివరకెన్నోసార్లు ఇచ్చాడు.

'సనత్‌నగర్ పోనీ' అన్నాడు విసుగుచెందని విక్రమార్కుడిలా.

సనత్‌నగర్ చేరేసరికి ఆటోమీటర్ అర్ధశతాన్ని దాటింది. శేఖర్ ఆఫీసుకు వెళ్లాడు. అదృష్టం..శేఖర్ సీట్లోనే కనిపించాడు. రంగారావుని చూడగానే సంబరంగా సీట్లోంచి లేచి ఎదురొచ్చాడు.

''రంగా..నీ కోసమే సాయంత్రం వద్దామను కున్నారా..అర్జంటు పనుంది'' అన్నాడు.

''ఏమిటది?'' అడిగాడు రంగారావు. ముందు వాడి పని చేసిపెడితే అప్పు తేలిగ్గా దొరకచ్చనే ఆశతో.

''నీకు ఎన్నోసార్లు డబ్బు సాయం చేశాను కాబట్టి కాదనవని నాకు తెలుసు. అర్జంటుగా అయిదొందలు కావాలిరా. మా ఆవిడ పుట్టింటికి వెడుతోంది. వాళ్ల నాన్నకి సీరియస్‌ట. ఈ నెల్లో బుజ్జిగాడిని స్కూల్లో చేర్పించటంతో అడ్డమైన వాడి దగ్గర అప్పు చేశాను. మళ్లీ అడిగితే కొట్టేట్టున్నారు. బళ్లో చేర్పించటమంటే ఇంత ఖర్చని కల్లోగూడా అనుకోలేదు. ఇక పిల్లలొద్దు బాబోయి అని లెంపలేసుకున్నా. నువ్వు కూడా నామాట విని పెళ్లి చేసుకోకు. పిల్లల్ని అసలే కనకు...ఇంతకీ అసలు విషయం. నువ్వు కూడా

**''వందా..నీ బొందా..అప్పుకోసం ఆటోలో తిరిగి అడుక్కునే వాడిని నిన్నే చూశా. ఇదిగో ఈ యాభై తీసుకుని నన్ను వదిలిపెట్టు నేను పనిమీద వెళ్ళాలి.'' అన్నాడు శంకరం, యాభైనోటు చేతిలో పెడుతూ.**



ఇబ్బందుల్లో వున్నావని తెలుసనుకో. అయిదొందలు కాకపోతే ఎంతో కొంతన్నా సర్దగలవా? అవతల ఆ ముసలాయన హరీ అంటే మళ్లీ నేను కూడా బయల్దేరాల్సొస్తుందేమో అని భయంగా వుంది'' అన్నాడు.

రంగారావు నీరుకారిపోయాడు.

'నిజం చెప్పాలంటే నేను కూడా అప్పుకోసమే వచ్చానురా. సాయంత్రంలోపల నేనే దాదాపు అయిదొందలు ఆటోకి కట్టాల్సి రావొచ్చు'' అన్నాడు నీరసంగా.

''ఆటో ఏమిటి.....అయిదొందలేమిట్రా?'' అర్థం కాక అడిగాడు శేఖర్.

''అదో పెద్ద కథలే గానీ నాకు గనక లక్కీగా ఓ వెయ్యిలాంటి పెద్ద మొత్తం సాయంత్రంలోగా అప్పు దొరికితే నీకు అయిదొందలు తెచ్చిస్తారా. ఓకే..గుడ్‌లక్..ఛీరియో'' అంటూ బయటపడ్డాడు రంగారావు.

ఇంక మిగిలింది శంకర ఒక్కడే.

అప్పు ఇస్తాడు కానీ దెప్పుతాడు. ఏదో ఓకటి అనకుండా ఇవ్వడు. ఇప్పుడవన్నీ పెట్టుకుంటే అయినట్టే. ముందు ఆటోని వదుల్చుకోవాలి.

'పంజాగుట్ట పోనీ' అన్నాడు నీరసంగా.

ఆటో శంకరం ఇంటిముందు ఆగేటప్పటికి అప్పుడే గేటు దాటి బయటికి పోబోతున్నాడు శంకరం.

''దొరికిపోయానా?'' అన్నాడు ఆటో దిగుతున్న రంగారావుని చూసి.

''చూద్దామని వచ్చా'' అన్నాడు రంగారావు ఏడవలేక నవ్వుతూ.

''అప్పుకోసం వచ్చుంటావురా..అంతేనా'' అన్నాడు ఎగతాళిగా-

''ఆ అవసరం కూడా ఉందనుకో...అర్జంటుగా ఓ వంద కావాలి'' అన్నాడు నసుగుతూ.

''వందా..నీ బొందా..అప్పుకోసం ఆటోలో తిరిగి అడుక్కునే వాడిని నిన్నే చూశా. ఇదిగో ఈ యాభై తీసుకుని నన్ను వదిలిపెట్టు నేను పనిమీద వెళ్ళాలి.'' అన్నాడు శంకరం, యాభైనోటు చేతిలో పెడుతూ.

''ప్లీజ్ ఒక్క వంద ఇయ్యవోయి..అంతా కలిపి ఇచ్చేస్తాను.'' బతిమాలుతూ అడిగాడు రంగారావు.

జేబు చూసుకుని ''నిజంగా లేదురా'' అని ఇంకో పది చేతిలో పెట్టి విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు శంకరం.

దిగాలుగా ఆటో దగ్గరకు వచ్చాడు రంగారావు.

''ఎంతయ్యింది?'' అని అడిగాడు.

''అరవై రూపాయి లివ్వండి'' అన్నాడు డ్రైవర్.

''అదేమిటి...యాభయ్యేడు రూపాయల ఎనభై పైసలేగా?''

''పొద్దుట్నించీ ఊరంతా తిప్పారు. రెండ్రూపాయలన్నా ఎక్కువ ఇవ్వరా'' అన్నాడు డ్రైవరు దబాయింపుగా. రంగారావు చేతిలో అరవై రూపాయలు లాక్కుంటూ.

''ఎందుకివ్వాలయ్యా ఎక్స్‌ట్రా...చిల్లరియ్యి'' గుడ్లనీరు కుక్కుకుంటూ అరిచాడు రంగారావు. అతని ఆక్రోశానికి జాలిపడ్డ ఆటోడ్రైవర్ చిల్లర వెతికి రూపాయిన్నర చేతిలో పెట్టి రయ్యిమంటూ పారిపోయాడు.

కొంపకు చేరేందుకు కనీసం బస్సు ఛార్జీ దక్కినందుకు సంతోషిస్తూ బస్టాండు వైపుదారి తీశాడు రంగారావు.

★